క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధిస్తే బహుమతులు



మాట్లాడుతున్న ముస్కు స్వామి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన రజక విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్కు స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఆయన ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ బహుమతి రూ.11,101, ద్వితీయ బహుమతి రూ.5101, తృతీయ బహుమతి రూ.2,101 అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల మార్కుల మెమోలు సమర్పిస్తే జాబితా తయారు చేసి ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అర్గుల స్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో అనర్హుల ఎంపికపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బోథ్: సొనాల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హులను ఎంపికచేశారని బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారి సంబంధీకులను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్, నాయకులు బాషెట్టి రమేశ్, బండారి మురళీ, కసిరే పోతన్న, మిట్కరి రాజేశ్వర్, డొగోడే విష్ణు, శ్రీకాంత్, తులసీరాం, జైతు, సాద్మెరి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'అవినీతిని ఎదిరిస్తే కేసులు పెట్టారు'


కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: గత బీఆర్‌ఎస్ హయాంలో అవినీతిని ఎదిరిస్తే కేసులు పెట్టారని యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కోర్టుకు పలువురితో హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2020లో బేల మండలం సాంగిడిలో ఉపాధిహామీ పథకంలో అవినీతి జరిగిందని ప్రశ్నిస్తే అప్పటి అధికార పార్టీ నాయకులు పోలీసులతో అరెస్టు చేయించి కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి, బీఆర్‌ఎస్‌కు ఎంతో తేడా ఉందన్నారు. కోర్టుకు హాజరైనవారిలో ప్రవీణ్, నర్సారెడ్డి, నర్సింగ్, దివాకర్‌రెడ్డి,సునీల్, జితేందర్, ఆశన్న, జనార్దన్, సుభాష్ తదితరులు ఉన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: మావల మాజీ సర్పంచ్ రాళ్లబండి సుదర్శన్ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం దస్నాపూర్‌లోని వారి నివాసానికి చేరుకుని మృతదేహం వద్ద మౌనం పాటించారు. ఆయన కుమారుడు మహేందర్‌ను ఓదార్చారు. ఆయన వెంట సాజిదొద్దీన్, ఇజ్జగిరి అశోక్, రవి, విఠల్ ఉన్నారు.

మహిళలకు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: మహిళలకు ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని ఏఎస్సై సుశీల అన్నారు. జిల్లాకేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న వారికి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ మహిళలకు ఎవరైనా ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేస్తే షీటీం పోలీసులను సంప్రదించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇదిలా ఉండగా బీసీ స్టడీసర్కిల్ సెంటర్‌లో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించి షీటీంలో ఉద్యోగం చేస్తున్న లావణ్య, శృతిలను సన్మానించారు. శిక్షణపొందిన చోట చట్టాలపై అవగాహన కల్పించేందుకు అవకాశం లభించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

దిగుబడి అంతంతే..

- వేరుశనగ పంటకు సోకిన తెగుళ్లు
- మార్కెటింగ్ సౌకర్యం కరువు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- సాగుతో నష్టపోయామని ఆందోళన


తెగుళ్లు సోకి ఎండుబారిపోతున్న వేరుశనగ పంట

తాంసి: ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో రైతులు వేరుశనగ సాగు చేసినా ఆశించిన దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తోంది. పంట సాగుకు పెట్టుబడి వ్యయం పెరిగినా దిగుబడి తగ్గింది. పురుగు ఉధృతి, తెగుళ్ల సోకడంతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడింది. దిగుబడి సమయంలో వేరుశనగ కర్రలు ఎండుబారడంతో పంట దెబ్బతింది. తెగుళ్ల ఉధృతి కారణంగా దిగుబడి సరిగ్గా లేదు. అంతంత మాత్రంగా వచ్చిన పంటను విక్రయిద్దామంటే స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు దక్కడం లేదు. పంట గిట్టుబాటు ధర లేకుండా దళారులను ఆశ్రయించడంతో నష్టపోతున్నారు.

దక్కని మద్దతు ధర

జిల్లాలో గతేడాది యాసంగి సీజన్‌లో రైతులు 8 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. పంట దిగుబడి వచ్చినా మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు దళారులకు తక్కువ ధరకే పంటను విక్రయించి నష్టపోయారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో ఈ ఏడాది భారీగా పంట సాగు విస్తీర్ణం తగ్గింది. తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో గత జనవరిలో దాదాపు 500 ఎకరాలు సాగు చేయగా పంట చేతికొచ్చింది. ప్రభుత్వం క్వింటాల్ రూ.6783 మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు పంటను విక్రయించాల్సి వస్తోంది. పంట చేతికి రాకముందు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ.7వేల వరకు ధర పలికింది. ధర బాగుండటంతో పంట సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో డిమాండ్ లేదంటూ దళారులు ధర పూర్తిగా తగ్గించారు. ప్రస్తుతం క్వింటాల్ రూ.5వేల నుంచి రూ.5,500 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. పంట నిల్వ చేసుకోలేక, మద్దతు ధరకు విక్రయిద్దామంటే కొనుగోలు కేంద్రం లేక దిక్కులేని పరిస్థితుల్లో దళారులకు విక్రయిస్తున్నారు. వారు చేలకు వచ్చి పంట నాణ్యతను చూసి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు.

ఎండుతెగులతో తగ్గుముఖం

ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు ఎండు తెగులు సోకడంతో సరైన దిగుబడి రాలేదు. లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉండటంతో పంట ఆకులను మొత్తం దెబ్బతీసింది. రైతులు పురుగు మందుల పిచికారి చేశారు. పంట ఎదిగే సమయంలో పురుగు, తెగుళ్ల ఉధృతి ఉండటంతో దిగుబడి తగ్గింది. గతేడాది ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది అంతంతమాత్రంగా ఉంది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీనికితోడు పంటతీసే సమయ ంలో చిరుజల్లులతో పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాలో కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

15 క్వింటాళ్ల దిగుబడి



ప్రస్తుత యాసంగి సీజన్‌లో నాలుగెకరాల్లో వేరుశనగ సాగుచేశా. పంటకు తెగుళ్లు సోకడంతో ఎండుబారిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. నాలుగెకరాలకు కేవలం 15 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. పంటను చేనులో క్వింటాల్ రూ.5300 చొప్పున విక్రయించా. దిగుబడి లేక ధర రాక నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది.

– గిజ్జ రామన్న, రైతు, వడ్డాడి

గత రెండేళ్లుగా నష్టం



ఏటా వేరుశనగ సాగుచేసి దిగుబడి లేక మార్కెట్ లేక మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయించేవాళ్లం. గత రెండేళ్లుగా నష్టం తప్ప లాభం లేదు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో జొన్న, మొక్కజొన్న సాగుచేశాం. వేరుశనగ సాగు చేయక ముందు మార్కెట్‌లో ధర ఉంది. పంట చేతికొచ్చే సమయంలో దళారులు ధర తగ్గించేస్తున్నారు. పంట సాగు చేసినా పెట్టుబడి కూడా రాని పరిస్థితి.

– బద్దం ఈశ్వర్‌రెడ్డి, రైతు, జామిడి

బీఆర్‌ఎస్‌లో చేరికలు


ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న గాంధీనగర్ గ్రామస్తులు

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ వెంట నడవటానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని గాంధీనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పెద్ద ఎత్తున గ్రామస్తులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు మోసపోయామని గ్రహించారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వరని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ తిరుమల్‌గౌడ్, మాజీ సర్పంచ్ పాండురంగ్ , లోక శిరీష్‌రెడ్డి, పోశాలు, నర్వడే రమేశ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: బోథ్‌కు చెందిన ఖలీల్ అహ్మద్‌కు రూ.60 వేలు, బోథ్ మండలం నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ ప్రదీప్‌కు రూ.37 వేలు సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వారికి చెక్కులు అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విలేకరిపై కేసు

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన నకిలీ విలేకరి దీపక్‌పై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈనెల 28న విలేకరినంటూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడి, రూ.500లు తన వద్ద తీసుకున్నాడని ప్రిన్సిపాల్ రంగన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఏఎస్సైలు లింగన్న, కనక జీవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎస్సై శివరాం

సిరికొండ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఎస్సై శివారం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా, లైసెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట వాహన ధ్రువపత్రాలు తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు భూభారతిపై అవగాహన

బేల: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటలకు భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు హాజరవుతారని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం మండల రైతులు హాజరుకావాలని కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్


జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో దాల్‌మిల్ వద్ద మార్క్‌ఫెడ్, ప్రజామిత్ర రైతు మ్యాక్ పెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్న కొనుగోలు కేంద్రంతోపాటు మట్టి పరీక్ష యంత్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంట విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని స్థాపించుకుందాం


రైతు లింగన్న నివాళులర్పిస్తున్న విశారదన్ మహారాజ్

తలమడుగు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై మన రాజ్యాన్ని స్థాపించుకుందామని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, గ్రంథాలయాన్ని సందర్శించారు. సుంకిడిలో ఇటీవల రైతు కుమ్మరి లింగన్న ఆత్మహత్య చేసుకోగా లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత సుంకిడి మీదుగా కజ్జర్ల గ్రామానికి రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని సాధించేందుకు లక్ష కిలోమీటర్ల రథయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముందుగా జిల్లాలోని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం కజ్జర్లలో గతంలో పేదలకు పంపిణీ చేసిన భూములను పరిశీలించారు. రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షులు అగ్గిమాల గణేశ్, ఉపాధ్యక్షురాలు సుష్మ, శ్రీవాణి, దివ్యవాణి, శ్యామల, నవీన్, గంగన్న, వేణుకుమార్, మధు, విష్ణు, ప్రతాప్, అశోక్, రమణ గంగన్న, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

నీటి కోసం ఇక్కట్లు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని చోర్గావ్ పంచాయతీ పరిధిలో గోండుగూడ, మత్తుర తండా గ్రామాలు ఉన్నాయి. దాదాపు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామాల్లో మూడు రోజులకోసారి మిషన్ భగీరథ నీరు రావడంతో గ్రామస్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో చుక్కనీరు రావడం లేదని వాపోతున్నారు. మత్తుర తండాకు 2 కి.మీ దూరంలో ఉన్న వ్యవసాయ బావి నుంచి బిందెల ద్వారా నీటిని తీసుకుంటున్నారు. నీటి సమస్య పరిష్కరించాల్సిన అధికారుల నిధులు లేవనే సాకుతో తప్పించుకుంటున్నారని మంగళవారం చేతిపంపు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ డిమాండ్ చేశారు. గాదిగూడలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని అత్యంత మారుమూల మండలం అందులో ఆదివాసీ గిరిజనులు అధికంగా నివాసముండే ప్రాంతమని అన్నారు. ఇప్పుడిప్పుడే మూఢ నమ్మకాలను వీడి ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వస్తున్న గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడానికి 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కలెక్టర్ రాజర్షి షా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆయన వెంట నాయకులు మధు, గంగారాం తదితరులు ఉన్నారు.

అడవిపందుల దాడిలో ఒకరికి గాయాలు


గాయపడిన మోతీరాం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొమ్ముగూడ సమీపంలో సోమవారం రాత్రి అడవి పందుల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. వంకతుమ్మ గ్రామానికి చెందిన గేడం మోతీరాం సోమవారం నిత్యావసర సరుకుల కోసం బైక్‌పై ఉట్నూర్ మండల కేంద్రానికి వెళ్లాడు. రాత్రి తిరుగుపయనంలో అడవి పందులు గుంపుగా వచ్చి దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి క్షతగాత్రుడిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

పంచాయతీ కార్మికుడి మృతదేహంతో ఆందోళన

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్


గజకంటి ప్రభాకర్ (ఫైల్)


డీపీవో కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్/తాంసి: తాంసి మండలంలోని ఈదుల్లసావర్గాం గ్రామ పంచాయతీ కార్మికుడు గజకంటి ప్రభాకర్ (45) కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, సీఐటీయూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికుడు మృతదేహంతో డీపీవో కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శవాన్ని కార్యాలయ ఆవరణలో ఉంచి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనను విరమించాలని వారికి నచ్చజెప్పినా వినిపించుకోలేదు. సమాచారం అందుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అరెస్ట్ చేయించి టూటౌన్‌కు తరలించారు. ఈనెల 17న వీధి దీపాలు అమర్చడానికి ప్రభాకర్ (45) నిచ్చెనతో స్తంభాల పైకెక్కి మరమ్మతు చేస్తుండగా కిందకు జారిపడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మహారాష్ట్రలోని యావత్మాల్ ఆస్పత్రికి పంపించారు. ఐదురోజుల చికిత్స కోసం కుటుంబ సభ్యులు రూ.2 లక్షలకు పైగా ఖర్చుచేశారు. మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహన్ని రిమ్స్‌కు తీసుకువచ్చారు. తాంసి ఎస్సై రాధిక పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత పోలీసుల ఆధ్వర్యంలో మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో కార్మికుడి నిండు ప్రాణం బలైందన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, మూడెకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల పాలిటిశాపంగా మారిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు ఆరెల్లి మల్లేశ్, లంక రాఘవులు, బొజ్జ ఆశన్న, అలాల్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఆదిలాబాద్‌టౌన్: డీపీఓ కార్యాలయం ఎదుట మృతదేహంతో నిరసన వ్యక్తం చేసిన వారికి మద్దతు తెలిపిన సీపీఎం, సీఐటీయూ, బీఆర్‌ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు.

పైలట్ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి


సమస్య పరిష్కరించాలని సుగుణక్కకు వినతిపత్రం ఇస్తున్న మహిళ

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాటు చేస్తున్న పైలట్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పైలట్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా పలువురి నుంచి అధికారులు స్వీకరించారు. అప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి ఆయా సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ మండల కేంద్రాల్లో పైలట్ ప్రజావాణి కార్యక్రమాలు ఏర్పాటు చేసి అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు. భూ సమస్యలపై వివరాలు సేకరించి గడువులోగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొలంలో తవ్వకాల అడ్డగింత


తవ్వేయడాన్ని చూపిస్తున్న బాధిత రైతులు

బేల: మండలంలోని ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రూ.25 కోట్లతో చేపడుతున్న సాంగిడి రింగ్ బీటీ రోడ్డు పనుల్లో భాగంగా మొరం కోసం రోడ్డు పక్కన పొలంలో తవ్వేస్తున్నారని బాధిత రైతులు పారటకార్ బాలచందర్, జీవన్ పేర్కొన్నారు. మంగళవారం జేసీబీలతో చేపట్టిన తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంగిడి రింగ్ రోడ్డు పనులు 12 మీటర్ల వెడల్పులో చేపట్టాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్ తమ పొలాల్లో అదనంగా మరో 10 మీటర్లు అన్యాయంగా తవ్విస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లాఅధికారులు స్పందించాలని లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పంచాయతీల వారీగా జొన్న కొనుగోళ్లు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించిన తేదీల్లో జొన్న కొనుగోళ్లు చేస్తామని పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. నేడు (బుధవారం) అంజీ, హీరాపూర్, ఇంద్రవెల్లి(కే), మే 1న హర్కాపూర్, కేస్లాపూర్, 2న కేస్లాగూడ, దేవాపూర్, 3న ఏమాయికుంట, 5న పిప్రి, 6న ముత్నూర్, 7న దస్నాపూర్, 8న గిన్నేరా, 12, 13న తేజాపూర్, 14న వడగామ్, 15, 16న ఇంద్రవెల్లి(బి), 17, 19న దన్నోరా(కే), 20, 21న దన్నోరా(బి), 22, 23న ధర్మసాగర్, 24, 26న మెండపల్లి, 27, 28న గౌరపూర్, 29న వాల్గొండ హీరపూర్‌లో జొన్న పంట కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. పంచాయతీల వారీగా రైతులు గమనించి ఆయా తేదీల వారీగా జొన్న పంటను కేంద్రానికి తీసుకురావాలని పీఏసీఎస్ సీఈవో కోరారు.